క్లుప్తంగా

'మా గ్రామంలో మద్యం షాపు కావాలి'

గుండాల: మండల కేంద్రంలో మద్యం షాపు కావాలని స్థానికులు గ్రామ సభలో తీర్మానించారు. సోమవారం సర్పంచ్ కోరం సీతారాములు అధ్యక్షతన మద్యం షాపుపై గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. మద్యం దుకాణం కావాలా..? వద్దా..అనే అంశంపై చేతులెత్తే పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎక్కువ మంది షాపు కావాలని చేతులెత్తడంతో వారి అభిప్రాయం మేరకు తీర్మాణం చేశారు. ఈ సభలో పీసా కమిటీ కార్యదర్శి గోవింద నర్సింహారావు, ఉపాధ్యక్షుడు పెండెకట్ల పెంటయ్య, ఉప సర్పంచ్ మానాల ఉపేందర్, కార్యదర్శి శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి సన్మానం

మణుగూరురూరల్: మణుగూరు ఏరియా సింగరేణి కాలరీస్‌లోని ఏరియా వర్క్‌షాప్‌లో ఎలక్ట్రిషియన్ ఫోర్‌మెన్‌గా పని చేసి పదవీ విరమణ పొందుతున్న సూరంపల్లి నాగేశ్వరరావు దంపతులను మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహరావు, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, వైస్ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్‌లు వెంకట్రావుగౌడ్, ఎస్‌కె బాజీ సోమవారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. బీఆర్ఎస్ నాయకులు అడపా అప్పారావు, బొలిశెట్టి నవీన్, రామిడి రామిరెడ్డి, యాదగిరిగౌడ్, జావిద్‌పాషా, నరసింహారావు, రమణ, రాజు, టీపీసీసీ సభ్యుడు చందా సంతోష్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు నాయకులు పాల్గొన్నారు.

పథకాలను వివరించాలి

చంద్రుగొండ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్ అన్నారు. మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో సోమవారం ఆ పార్టీ మండల శాఖ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు దార వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి, ఉప్పతల ఏడుకొండలు, భూపతి శ్రీనివాసరావు, నల్లమోతు వెంకటనారాయణ, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా జరపాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలో గ్రామగ్రామానా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని టీఏజీఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య కోరారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అగష్టు 1 నుంచి 15 వరకు కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సోయం జోగారావు, సున్నం గంగ, కుంజా శ్రీను, కొర్సా రవి, విజయ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య సింగరేణి యాజ మాన్యాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఓసి2లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కన్వేయన్స్ డ్రైవర్లకు రావాల్సిన వేతన బకాయిలను, బోనస్, ఏరియర్స్‌లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, సీపీఐ మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, పార్టీ నాయకులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోరాడితేనే పరిష్కారం

దుమ్ముగూడెం: పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అంగన్‌వాడీ టీచర్స్-హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యురాలు పూనెం నర్సమ్మ అన్నారు. సోమవారం దుమ్ముగూడెం ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద జరిగిన ఏఐటీయూసీ సభ్యుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అనారోగ్యంతో చనిపోయిన టీచర్, ఆయాలకు 30 వేలు ఖర్చులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వెర్సుల మల్లికార్జున్, ప్రాజెక్ట్ ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

మరోమారు నిర్వహించాలి

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో ఏర్పాటు చేయనున్న మద్యం షాపుల విషయంలో గ్రామసభ మరోసారి నిర్వహించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో వినతిపత్రం అందించారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో నిబంధనలను పాటించలేదని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పెద్దిని వేణు, రాయి రాజా, విప్పర్ల వెంకటేశ్వర్లు, సీతారాములు పాల్గొన్నారు.

వంట కార్మికుల వినతి

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని సోమవారం వంట కార్మికులు వినతిపత్రాన్ని అందించారు. స్థానిక విద్యా వనరుల కేంద్రం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి, అనంతరం వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడారు. సీతా రాములమ్మ, కనకమ్మ, విజయ, మురళి పాల్గొన్నారు.

పనులన్నీ అసంపూర్ణమే..

- పూర్తికాని 'మన ఊరు-మన బడి'
- మొదలై ఏడాది దాటుతున్నా అదే పరిస్థితి
- అరకొర వసతులతో ఇక్కట్లు పడుతున్న విద్యార్థులు


తరగతి గదిలో భద్రపరిచిన నిర్మాణ సామగ్రి


తిరుమలకుంట పాఠశాల వరండాలోనే అన్ని తరగతుల విద్యార్థులకు పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు గతేడాది 'మన ఊరు-మన బడి'కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే, నిధుల విడుదలలో జాప్యం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేని తనం వెరసి పనులు నత్తనడకన సాగుతున్నాయి. విద్యాసంవత్సరం ఆరంభమై రెండు నెలలు కావొస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు.

తొలి దశలో 23 పాఠశాలలు..

మన ఊరు-మన బడి పథకంలో భాగంగా అశ్వారావుపేట మండలంలోని 23 ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి దఫాగా పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈమేరకు రూ.3.98కోట్ల నిధులను కేటాయించింది. ఈ పనులను 2023-24 విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే అంటే మే చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ పనులు మొదలు పెట్టి 15 నెలలైనా పూర్తి కాకపోవడంతో లక్ష్యం అటకెక్కింది. ఎక్కడ కూడా పనులు 60 శాతానికి దాటలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

జరిగిన పనుల్లోనూ నాణ్యతాలోపం..

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో విద్యార్థుల అవస్థలు పడుతున్నారు. మండలంలోని తిరుమలకుంట ప్రభుత్వ ప్రాథమికోన్న పాఠశాలలో 99 మంది విద్యార్థులు, ముగ్గురు టీచర్లు ఉండగా మన ఊరు-మన బడి ద్వారా రూ.27. 38లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాలకు అదనపు తరగతి గది, వంట గది, ప్రహరీ, మైనర్ రిపేర్లు చేయాల్సి ఉంది. కానీ ఏడాది దాటినా పూర్తికాలేదు. అంతేకాక పాఠశాలకు చేసిన మరమ్మతులు పనులు పూర్తి కాకముందే బీటలు వారాయి. తరగతి గదుల్లోనే సామగ్రి భద్రపర్చడంతో 1 నుంచి 6 తరగతుల విద్యార్థులను వరండాలో కూర్చోబెట్టి పాఠాలు చెప్పాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితే మిగతా చోట్ల కూడా సంబంధిత అధికారులకు పట్టడం లేదు.

పనులు వేగవంతం చేయిస్తాం

పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూస్తాం. పనులు ఆలస్యమైనా మాట వాస్తవమే. ఇందుకు నిధుల సమస్య కొంత కారణం. పద్నాలుగు పాఠశాల్లో రంగులు వేస్తే పనులు పూర్తయినట్లే. ఆయా పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

– కేఎస్‌బీ కృష్ణ, ఏఈ, అశ్వారావుపేట

ముచ్చటగా మూడే పూర్తి..

ఒక్కో పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.లక్షల్లో నిధులు కేటాయించింది. అశ్వారావుపేట మండలంలోని అచ్యుతాపురం, ఆసుపాక కాలనీ, గాండ్లగూడెం, గుమ్మడవల్లి(ఎంపీపీఎస్), మామిళ్లవారిగూడెం, మల్లాయిగూడెం, నారాయణపురం కాలనీ, వినాయకపురం కాలనీ, వడ్డె రంగాపురం, ఆసుపాక, నారంవారిగూడెం, నందిపాడు, తిరుమలకుంట, ఊట్లపల్లి, గుమ్మడవల్లి (జెడ్పీఎస్ఎస్), అశ్వారావుపేట (ఎంపీపీఎస్), పేరాయిగూడెం(బీసీ కాలనీ), అశ్వారావుపేట(ఉర్దూ), అశ్వారావుపేట (బాలుర జెడ్పీఎస్ఎస్), అశ్వారావుపేట (బాలికల జెడ్పీఎస్ఎస్) పాఠశాలలు మొదటి దఫాగా ఎంపికయ్యాయి. ఇందులో కేవలం అచ్యుతాపురం, ఊట్లపల్లి, బీసీ కాలనీ పాఠశాలల్లో వంద శాతం పనులు పూర్తి కావడం గమనార్హం. మిగతా చోట్ల అత్యధికం ప్లాస్టింగ్ దశలో ఉండగా, మరికొన్ని రంగులు వేయాల్సి ఉంది.

బాధితులను ఆదుకుంటాం


దెబ్బతిన్న కల్వర్టులను పరిశీలిస్తున్న విప్ రేగా కాంతారావు

పినపాక: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను, గోదావరి ముంపుకు గురైన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రేగా కాంతరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని బయ్యారం, రాయిగూడెం, చింతల బయ్యారం, భూపతిరావుపేట గ్రామాల్లో పర్యటించిన దెబ్బతిన్న రహదారులు, కోతకు గురైన వాగులను పరిశీలించారు. అనంతరం బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ప్రభుత్వం, పార్టీ అందగా ఉంటుందని త్వరలోనే నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. దెబ్బతిన్న రహదారులు, చెరువులు, డ్యాములను త్వరలోనే మరమ్మతులు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, రైతు సమితి అధ్యక్షుడు దొడ్డ శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

'రీ ఎస్టిమేట్' సిద్ధం చేయండి


సైడ్‌వాల్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

ములకలపల్లి: తాళ్లపాయ వద్ద పాములేరు వాగు వద్ద నిర్మిస్తున్న సైడ్‌వాల్‌ను మరింత పటిష్టంగా నిర్మించేందుకు 'రీ ఎస్టిమేట్'సిద్ధం చేయాలని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆర్అండ్‌బీ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు డీఈ శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు నిర్మాణంలో ఉన్న సైడ్‌వాల్ కొంతమేర కూలిపోవడంతో సోమవారం ఘటనా ప్రదేశాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ 1.80 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సైడ్‌వాల్ వరద ఉధృతికి దెబ్బతిన్నట్లు తెలిపారు. సీఎంతో మాట్లాడి. మరిన్ని నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు కారం సుధీర్, బైటి రాజేశ్, బీఆర్ఎస్ నాయకులు శనగపాటి సీతారాములు, పామర్తి వెంకటేశ్వరరావు, అడపా నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

నీళ్లపాలు చేస్తున్నారు: కట్రం స్వామి

ఇష్టారాజ్యంగా పనులు చేస్తూ ప్రజాధనం నీళ్లపాలు చేస్తున్నారని టీడీపీ అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కట్రం స్వామి అన్నారు. సైడ్‌వాల్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడారు. నిర్మాణ దశలోనే సైడ్‌వాల్ కూలిపోయిందని, అధికారుల పర్యవేక్షణాలోపమే కారణమని ఆరోపించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల చెన్నయ్య, చల్లా వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు ఉన్నారు.

నాణ్యత లేమితోనే..

నాణ్యత లేకపోవడంవల్లే నిర్మాణంలో ఉన్న సైడ్‌వాల్ కుంగిపోయిందని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు ఆరోపించారు. నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించిన ఆయన మాట్లాడారు. అధికారుల పట్టించుకోకపోవడం వల్లే పనులు లోపభూయిష్టంగా సాగుతున్నాయని అన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. స్థానిక సర్పంచ్ బైటి రాజేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పేటేటి నర్సింహారావు, నియోజకవర్గ నాయకులు దారబోయిన సురేశ్, కోరంపల్లి చెన్నారావు, జహీర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తాత్కాలిక రహదారి ఏర్పాటు


ఇసుకవాగు వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి

సాక్షి ఎఫెక్ట్..

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో ఇసుకవాగు వద్ద సోమవారం తాత్కాలిక రహదారి ఏర్పాటు చేసి గిరిజనులకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. ఇటీవల భారీ వర్షాలకు ఇసుకవాగు వద్ద తాత్కాలిక రహదారి కొట్టుకుపోయి రాకపోకలు లేక గిరిజనులు ఇబ్బంది పడుతుండగా జూలై 22న 'దారి చూపండి సారూ'అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. వర్షాలు, వరదలు తగ్గుముఖం పట్టడంతో ఆర్అండ్‌బీ ఏఈ రాంబాబు పర్యవేక్షణలో కాంట్రాక్టర్ ఇసుకవాగు వద్ద చప్టా ఏర్పాటు చేసి తాత్కాలిక రహదారి ఏర్పాటు చేశారు. గతంలో మట్టితో వేస్తేనే రోడ్డు కొట్టుకుపోయిందని వర్షాకాలంలో ఇబ్బంది లేకుండా తాత్కాలిక రహదారి పకడ్బందీగా నిర్మించాలని సర్పంచ్ పాయం భద్రమ్మ, గిరిజనులు కోరుతున్నారు.

అన్నపురెడ్డిపల్లిలో సంఘర్షణ యాత్ర


గేదె దూడకు కరపత్రాన్ని అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అన్నపురెడ్డిపల్లి: విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర సోమవారం అన్నపురెడ్డిపల్లికి చేరింది. యాత్రలో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలను విద్యార్థి సంఘం నాయకులు సందర్శించారు. సంక్షేమ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించడంతో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో కనీస వసతులు లేవని, నూతనంగా ప్రారంభించిన గురుకులాలకు సొంత భవనాలు లేక అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన కరపత్రాన్ని గేదె దూడకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ఇన్‌చార్జ్ తానం వంశి, బోడా అభిమిత్ర, వెంకటేష్, రామ్‌చరణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

అన్నపురెడ్డిపల్లి: రానున్న అసెంబ్లీ ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీదే గెలుపని ములకలపల్లి జెడ్పీటీసీ, టీపీసీసీ మెంబర్ సున్నం నాగమణి ధీమవ్యక్తం చేశారు. మండలంలోని తొట్టిపంపు గ్రామంలో సోమవారం ఆ పార్టీ మండలాధ్యక్షుడు వనమా గాంధీ ఆధ్వర్యంలో చేపట్టిన పల్లెపల్లెకు ఇందిరమ్మ బాట కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసి, పార్టీ హామీలను ఆమె ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఇనుపనూరి జమలయ్య, ఇనుగంటి ప్రసాద్, కొటేశ్వరరావు, మల్లేష్, వీరభద్రం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లింగన్న ఆశయ సాధనకు పోరాడుదాం


పోతిరెడ్డిగూడెంలో లింగన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్డీ నాయకులు

గుండాల: న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకుడు, అజ్ఞాత దళ నేత లింగన్న ఆశయ సాధన కోసం పోరాడుదామని ఎంపీపీ ముక్తి సత్యం, జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, సర్పంచ్ సీతారాములు పిలుపునిచ్చారు. సోమవారం లింగన్న 4వ వర్ధంతి సభలను మండలాల్లోని పలు గ్రామాల్లో నిర్వహించారు. లింగన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమి, భుక్తి , పేద ప్రజల విముక్తి కోసం చంద్రపుల్లారెడ్డి చూపించిన ప్రతిఘటన పోరాటమే మార్గమని నమ్మిన లింగన్నను ప్రభుత్వమే హత్య చేయించిందని, లింగన్న బాటలో పనిచేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అన్నారు. వర్ధంతి సభలను వారం రోజుల పాటు గ్రామగ్రామాన నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పర్శిక రవి, యాసారపు వెంకన్న, అరెం నరేష్, ఉపేందర్, గడ్డం లాలయ్య, ఈసం కృష్ణ, పెంటన్న, బాబు, మంగన్న, లాజర్, రంగన్న, శేఖర్, కిషన్, లాలు, ఉపేందర్, అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథా ఆధ్వర్యంలో..

లింగన్న 4వ వర్ధంతిని పురస్కరించుకుని ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సభ నిర్వహించారు. లింగన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు అర్పించారు. అనంతరం పార్టీ జిల్లా నాయకుడు ఈసం శంకర్, మండల కార్యదర్శి కొమరం శాంతయ్య, పీవైఎల్ జిల్లా కార్యదర్శి వాంకుడోత్ అజయ్‌లు మాట్లాడుతూ.. భూమి, భుక్తి విముక్తి కోసం సాగిన భారత విప్లవ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిన లింగన్న మరణం ఎప్పటికీ తీరని లోటన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఈసం కృష్ణ, కుమార్, జగన్, మంగయ్య, పాపారావు, సురేష్, నరేష్, తెల్లం రాజు, వెంకన్న, కిసెందర్, దర్మరాజు, భాస్కర్, రజినీ కాంత్, మొక్క సంతు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు రద్దు

భద్రాచలంటౌన్: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో భద్రాచలం ఆర్టీసీ డిపో పరిధిలోని భద్రాచలం నుంచి వెంటకటాపురం రూట్‌లో సాయంత్రం సర్వీసులను రద్దు చేసిన్నట్లు డిపో మేనేజర్ బి.రామారావు సోమవారం తెలిపారు. భద్రాచలం నుంచి చర్ల, వెంకటాపురం వెళ్లే సర్వీసులను సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు నిలిపివేసిన్నట్లు ఆయన పేర్కొన్నారు. పోలీస్ శాఖ సూచనల మేరకు ఈ నెల 6 వరకు సర్వీసులు రద్దులోనే ఉంటాయని తెలిపారు.

కళాకారుల వినతి

మణుగూరురూరల్: సింగరేణి వ్యాప్తంగా కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సింగరేణి కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు సోమవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కళాకారుల ఐక్యవేదిక ఏరియా అధ్యక్షుడు సురేందర్, ఉపాధ్యక్షుడు నర్సయ్య, సెంట్రల్ కమిటీ ప్రచార కార్యదర్శి పవన్ కుమార్, డేవిడ్ రాజ్, హబీబ్, రత్నం, దీపక్, శ్రీనివాస్, శంకర్, రాజ్‌కుమార్, కార్తీక్, సుమన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ములకలపల్లి: మాజీ సొసైటీ డైరెక్టర్ కోంద్రు సుందర్‌రావు, భాస్కర్ కుటుంబాలను ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు పరామర్శించారు. వీరి తల్లి లక్ష్మీభాయి ఇటీవల మృతి చెందగా, సోమవారం జరిగిన దశదిన ఖర్మకు ఎమ్మెల్యే మెచ్చా హాజరయ్యారు. లక్ష్మీభాయి చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సర్పంచ్‌లు బైటి రాజేశ్, కారం సుధీర్, సున్నం సుధాకర్, దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వర్లు, స్థానిక జెడ్పీటీసీ సున్నం నాగమణి బీఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతంలో పర్యటన

మణుగూరురూరల్: గోదావరి వరద ముంపు ప్రాంతమైన చినరాయిగూడెంలో టీడీపీ నాయకులు సోమవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా ముంపు బాధితులతో మాట్లాడుతూ.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వరద బాధితులకు పరిహారం చెల్లించి అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకులు చందా మధు, సమితిసింగారం సర్పంచ్ బచ్చల భారతి, కూచిపూడిబాబు, కృష్ణ, మేదరమెట్ల శ్రీనివాసరావు, ధర్మరాజుల శంకర్ పాల్గొన్నారు.

విమర్శలు సరికాదు..

బూర్గంపాడు: ప్రభుత్వ విప్ రేగా కాంతారావుపై సర్పంచ్ పాలెబోయిన శ్రీవాణి విమర్శలు చేయడం సరికాదని బూర్గంపాడు మార్కెట్ చైర్‌పర్సన్ పాడియం ముత్యాలమ్మ పేర్కొన్నారు. లక్ష్మీపురంలో సోమవారం ఆమె జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సర్పంచ్‌తో కలిసి మాట్లాడారు. నియోజకవర్గాన్ని సమగ్రాభివృద్ధి చేస్తున్న విప్‌ను విమర్శించడం గర్హనీయమని అన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు సిరిపురపు స్వప్న, భూక్యా శ్రావణి, తుపాకుల రామలక్ష్మి, వెంకటరమణ, కొర్సా లక్ష్మి, పి.సూరమ్మ, యల్లంకి లలిత పాల్గొన్నారు.

చర్ల సీఐగా రాజగోపాల్



చర్ల: చర్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.అశోక్‌కు బదిలీ అయింది. ఆయన స్థానంలో ఏడూళ్ల బయ్యారంలో పనిచేస్తున్న బి.రాజగోపాల్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు ఇక్కడ పనిచేసిన అశోక్ అన్నివర్గాల ప్రజలు మన్ననలు పొందడంతో పాటు మావోయిస్టుల కార్యకలాపాలను కట్టడి చేయడానికి కృషి చేశారు. కాగా, రాజగోపాల్ గతంలో ఇక్కడ ఎస్సైగా పనిచేసి ఉండడంతో సీఐగా నియమించినట్లు తెలుస్తోంది.

బాధ్యతలు స్వీకరించిన సీఐ

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నూతన సీఐగా టి.కరుణాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐల బదిలీ నేపథ్యంలో ఈ నెల 18న స్థానిక సీఐగా పని చేస్తున్న బొమ్మర బాలకృష్ణను ఐజీ ఆఫీస్(హైదారాబాద్)కు అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో పని చేస్తున్న సీఐ కరుణాకర్‌ను నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, ఈ మేరకు సోమవారం బాధ్యతలు చేపట్టారు. నూతన సీఐకు స్థానిక ఎస్సైలు పి.శ్రీకాంత్, శివరామకృష్ణతోపాటు ఏఎస్సైలు, పోలీస్ సిబ్బందితోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సై..

చంద్రుగొండ: చంద్రుగొండ ఎస్సైగా మాచినేని రవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. సుమారు ఏడాదిన్నరకాలంగా ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న గొల్లపల్లి విజయలక్ష్మి బదిలీపై ఇల్లెందు వెళ్లారు.

కోతకు గురైన రహదారి

అశ్వాపురం: ఇటీవల గోదావరి వరదలకు మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీలోని గరిబడ్డు వద్ద మొండికుంట-సారపాక రహదారి కోతకు గురైంది. ఇటీవల ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో కడియాలబుడ్డి వాగుపై నూతన వంతెన నిర్మించగా వంతెన వెంబడి రహదారి కోతకు గురైంది. రహదారి పూర్తిగా కోతకు గురికాకముందే చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిత్యావసరాల పంపిణీ

గుండాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన ముత్తాపురం బాధితులకు మోకాళ్లా వారి గుంపు గ్రామస్తులు, మార్త రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. గ్రామం నుంచి 49 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 25 కేజీ చొప్పున బియ్యం, రామకృష్ణ ఒక్కో కుటుంబానికి 25 కేజీల చొప్పున బియ్యం వేరువేరుగా అందించారు. ఎంపీపీ ముక్తి సత్యం, గ్రామస్తులు మెకాళ్ల సూర్యనారాయణ, కుంజ రామయ్య, జోగ కృష్ణయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అదే గ్రామానికి చెందిన ముక్తి సర్సయ్య కుటుంబ సభ్యులు 43 బాధిత కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోకాళ్ల రమనయ్య, పోతయ్య, శంకర్, ముక్తి ముత్తయ్య, కొమరం శాంతయ్య, రాజబాబు, సుగుణయ్య, జోగయ్య, కృష్ణ, నవీన్, మహేష్, ప్రభుచ నాగరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

పులిహోర ప్యాకెట్లు..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని నన్నపనేని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని ముంపు బాధితులకు అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు మస్తాన్ మాట్లాడారు. ఉస్మాన్, ఖలీల్, ఖయ్యూం, మోయిన్, ఇమామ్, సాధిక్, ఇలహి భక్షి, మైదిన్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని వరద కారణంగా పునరావాస కేంద్రాలలో వసతి పొందుతున్న బాధితులకు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుడితి రవిబాబు, కోటేశ్వరరావు, వెంకట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం..

దుమ్ముగూడెం: మండలంలోని గోదావరి వరద ప్రభావిత సున్నంబట్టి గ్రామంలో 300 మందికి నర్సాపురం గ్రామంలోని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం చిన్న అరుణాచలం తరుపున వ్యవస్థాపకులు శివ నాగ స్వామి సోమవారం అన్నదానం చేశారు. గోదావరి వరదలతో గ్రామం వదిలి పునరావాస కేంద్రాలకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన బాధితులకు ఆలయం తరుపున అన్నదానం చేశారు.

గ్రామాల్లో ముమ్మరంగా వైద్యశిబిరాలు


అశ్వారావుపేటరూరల్: పరీక్షలు చేస్తున్న వైద్యుడు రాందాస్ నాయక్

అశ్వారావుపేటరూరల్: వినాయకపురం పీహెచ్‌సీ వైద్యుడు రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని మలేరియా ప్రభావిత ప్రాంతమైన పాత రెడ్డిగూడెంలో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మొత్తం 41 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి, 8 మంది జ్వర పీడితులను గుర్తించారు. ఎవరికీ నిర్ధారణ కాలేదని వైద్యులు తెలిపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత, జ్వరాలు, దోమలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్ఈఓ రాజు, సూపర్‌వైజర్ శ్రీనివాస్, సిబ్బంది గోపాల్, సత్యనారాయణ, ప్రసాద్, ఏఎన్ఎంలు బేబి నాంచారి, విజయలక్ష్మి, రాములమ్మ, జయ పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని రాజాపురం గ్రామంలో సోమవారం ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో గ్రామస్తులకు మండల వైద్యాధికారిణి ప్రియాంక వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామంలో ఎక్కువ సంఖ్యలో కంటికి సంబంధించిన కండ్లకలక కేసులు నమోదయ్యాయి. దీంతో ప్రజలకు కండ్లకలక గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ కృష్ణయ్య, హెచ్ఎస్ నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, వాణి, పుష్పా, ఆశాలు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో..

మణుగూరురూరల్: మండలంలోని అశోక్‌నగర్‌లోని బాలికల వసతి గృహంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యాధికారి శివ కుమార్ విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం వసతి గృహ పరిసరాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆదర్శనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, రవి, హిమబిందు, విజయ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.